

మున్సిపాలిటీ	ధర్మవరం
వార్డులు	40
జనాభా	1.48లక్షలు
వీధికుక్కలు	7వేలకుపైగా
కుక్కకాటు బాధితులు	3నెలల్లో 52మంది

ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన లక్ష్మి ఇటీవల తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా సమీపంలోనే ఉన్న కుక్కలు కరిచాయి. కాలికి కాట్లు పడ్డాయి. అలాగే తేరుబజార్‌కు చెందిన వెంకటనారాయణ ద్విచక్రవాహనంపై వెళుతుండగా కుక్కలు దాడిచేశాయి. అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇలా నిత్యం ఏదో ఒక చోట కుక్కలు ప్రజలపై విరుచుకుపడుతున్నాయి.



భౌ.. కెవ్..

- ఒంటరిగా కనిపిస్తే దాడే..
- ద్విచక్ర వాహనదారులూ బెంబేలే
- మూడు నెలల్లో 52 మందికి కుక్కకాట్లు

ధర్మవరం అర్బన్: పుర ప్రజలు శునకాల ధాటికి హడలెత్తిపోతున్నారు. ఒంటరిగా కనిపిస్తే చాలు వెంటాడి మరీ దాడి చేస్తున్నాయి. ధర్మవరం మున్సిపల్ అధికారులు కుక్కల నియంత్రణలో విఫలమయ్యారు. ఏ వీధి చూసినా కుక్కలు కనిపిస్తున్నాయి. అటువైపు ఒంటరిగా వెళ్లే చిన్నారులు, వృద్ధులు, ద్విచక్రవాహనదారులపైకి ఎగబడుతున్నాయి. రాత్రి వేళ అయితే మూకుమ్మడిగా రౌండప్ చేసి మరీ దాడి చేస్తున్నాయి. వాటి బారి నుంచి రక్షించుకునే క్రమంలో వాహనదారులు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. పట్టణంలో 40 వార్డులు ఉన్నాయి. ఒక్కో వీధిలో 20 నుంచి 30కి పైగా కుక్కలు తిష్ట వేస్తున్నాయి. ఇలా ఒక్కో వార్డులో 150 నుంచి 200 దాకా సంచరిస్తున్నాయి.

నియంత్రణపై నిర్లక్ష్యం

వీధి కుక్కలు సంతానోత్పత్తి చేయకుండా వాటిని పట్టుకుని ఆపరేషన్లు చేయాలి. యాంటీరేబిస్ ఇంజెక్షన్లు వేసి ప్రత్యేకంగా కేటాయించిన ప్రదేశానికి తరలించి సంరక్షించాలి. వీధి కుక్కల సంరక్షణకు ప్రత్యేక స్థలం కేటాయించాలి. ఆపరేషన్లు, ఇంజెక్షన్లు చేసేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. అయితే వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా కుక్కలు వృద్ధి చెంది ప్రజలపై విరుచుకుపడుతున్నాయి.

బయటకు రావాలంటేనే జంకు

వీధి కుక్కల బెడదతో ఇంట్లో నుంచి బయటకు అడుగుపెట్టాలంటే ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కలు పిచ్చి పట్టినట్లు ప్రవర్తిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాలను వెంబడిస్తుండడంతో వాటి బారి నుంచి రక్షించుకునే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాలపాలవుతున్నారు.



ధర్మవరంలోని సత్యసాయినగర్‌లో ద్విచక్రవాహనదారులను కరిచేందుకు వెళుతున్న కుక్కలు

కుక్కలను దూరంగా ఉంచాలి



వీధి కుక్కలను పట్టణానికి దూరంగా ఉంచితే బాగుంటుంది. వీధుల్లో తిరుగుతూ వాహనదారులపైకి ఎగబడుతున్నాయి రాత్రిపూట ఇంటికి వెళ్లాలన్నా భయంగా ఉంటోంది. కుక్కలను ఊరికి దూరంగా తరలించేలా మున్సిపల్ అధికారులు చొరవ చూపాలి.

– వై.రామకృష్ణ, కొత్తపేట, ధర్మవరం

ఆపరేషన్లు చేయించాలి



మున్సిపల్ అధికారులు గతంలో కుక్కల సంతతి పెరగకుండా ఆపరేషన్లు చేయించేవారు. ఇటీవల దాని గురించి పట్టించుకోవడం లేదు. దీంతో కుక్కల విపరీతంగా పెరిగిపోయాయి. వీధుల్లో సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆపరేషన్లపై దృష్టి సారించాలి.

– ఎం.మహేంద్ర, యాదవవీధి, ధర్మవరం

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. పాదచారులు, వాహనదారులను కరిచి గాయపరుస్తున్నాయి. వాటిని పట్టణానికి దూరంగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తాం. కుక్కలకు వ్యాక్సిన్ వేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం

క్లుప్తంగా

ముగిసిన అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటలోనున్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, పుష్ప యాగం, మంత్ర పుష్పం, ద్వాదశ నైవేద్యం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు సుదర్శనాచార్యులు, శిష్య బృందం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

మాఘ పౌర్ణమి వేడుకలు

పుట్టపర్తి: బుక్కపట్నం చెరువుకు ఆనుకుని ఉన్న పురాతన వరగిరి వేంకటేశ్వర ఆలయంలో బుధవారం మాఘ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు తిప్పయ్య కుటుంబ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదాలందించారు. రాత్రి భక్తులు భజన కార్యక్రమం చేపట్టారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

ఓడీచెరువు : శ్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురైందని ఆకుతోటపల్లి ఎస్సీ కాలనీ వాసులు తహసీల్దార్ అనంతాచారికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఎస్సీలు వినియోగిస్తున్న శ్మశానవాటిక స్థలం తమదేనంటూ కొందరు ఆక్రమించారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీల సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు వీరాంజనేయులు కోరారు. సర్వే పూర్తి చేయించి స్థలం కేటాయిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బలరాం, కిష్టప్ప, చెన్నరాయుడు, ఓబుళేసు, రంగప్ప పాల్గొన్నారు.

'జీవానంద'పై చర్యలకు డిమాండ్



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మవరం: పాఠశాల పరిసరాల్లో చెత్తకు అంటించిన మంటల్లో ఎల్‌కేజీ విద్యార్థి ప్రమాదవశాత్తూ పడి గాయాలపాలైతే నిర్లక్ష్యంగా వ్యవహరించిన జీవానంద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, పోతలయ్య, నింజన్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఏఓ ఖతిజున్‌కుబ్రాకు వినతిపత్రం అందించారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

గాండ్లపెంట: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి బుధవారం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఆదాయ, వ్యయాలతో పాటు పారిశుద్ధ్యం, తాగునీరు, ఇంటి, నీటి పన్నుల వసూళ్లపై దృష్టిసారించాలన్నారు. ప్రత్యేకించి మూడో శనివారం మండల కేంద్రంతో పాటు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుట్టపర్తి బాలునికి యంగ్ జీనియస్ అవార్డు



పురం అలెక్స్

పుట్టపర్తి అర్బన్: హైదరాబాద్‌కు చెందిన సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో పుట్టపర్తికి చెందిన పురం అలెక్స్ అనే బాలుడు ప్రతిభ కనబరచి సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఎనుములపల్లి వాసవీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అలెక్స్ 2024–25 సంవత్సరానికి నిర్వహించిన పరీక్షలో జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించాడని యాజమాన్యం తెలిపింది. ఈ నెల 16న హైదరాబాద్‌లోని లలిత కళా తోరణం, పబ్లిక్ గార్డెన్స్‌లో ఈ అవార్డు అందజేయనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ వై.కిరణ్ నుంచి లేఖ వచ్చినట్లు పేర్కొంది. దీంతో అలెక్స్‌ను పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు.

పట్టుచీరల చోరీపై ఫిర్యాదు

ధర్మవరం అర్బన్ : ఆటోలో ఉంచిన పట్టు చీరలను దుండగులు చోరీ చేశారు. ఈ ఘటనపై ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు అందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాంతినగర్‌కు చెందిన దాసరి లక్ష్మీనారాయణ పట్టుచీరలను యాడికికి తీసుకెళ్లేందుకు జనవరి 25న ఆటోలో భద్రపరిచాడు. అయితే అప్పటికే రాత్రి అయ్యిందని ఉదయాన్నే పట్టుచీరలు తీసుకెళ్లవచ్చని లక్ష్మీనారాయణ నిద్రపోయాడు. అదే రోజు రాత్రి ఆటోలో ఉంచిన 21 పట్టు చీరల బాక్సు అపహరణకు గురైంది. మరుసటి రోజు గమనించాడు. రూ.1.05 లక్షలు విలువ చేసే చీరల బాక్సును స్థానికులు ఆట పట్టించడానికి దాచి పెట్టారేమోనని భావించాడు. ఎన్ని రోజులు ఎదురు చూసినా పట్టుచీరల బాక్స్ జాడ తెలియకపోవడంతో ఎవరో చోరీ చేశారని నిర్ధారణకు వచ్చి బుధవారం రాత్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ

పుట్టపర్తి అర్బన్: భూముల క్రమబద్ధీకరణకు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ తెలిపారు. జీఓ 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం – 2025 పేరట భూముల క్రమబద్ధీకరణ చేపడతామని, దరఖాస్తులను డిసెంబర్ 31 వరకు స్వీకరిస్తామని వెల్లడించారు. నిర్దేశించిన ధ్రువపత్రాలతో 'మీ సేవ' ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. 2019 అక్టోబర్ 15ను ప్రామాణికంగా తీసుకొని అంతకన్నా ముందు ఆక్రమణలో ఉన్న భూములకు నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్టు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాలు క్రమబద్ధీకరించబోమన్నారు. కుటుంబ సభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు పరిశీలించి అర్హత కలిగిన వాటికి క్రమబద్ధీకరణ పూర్తి చేస్తారన్నారు. అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ శాఖ ఏఈ బాధ్యతల స్వీకరణ



సురేంద్ర

నల్లచెరువు: మండల విద్యుత్ శాఖ ఏఈగా బుధవారం సురేంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు నూతన ఏఈకి ఘనంగా స్వాగతం పలికారు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు సబ్ ఏఈగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నల్లచెరువుకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

నల్లచెరువు: మండల కేంద్రంలోని నల్లచెరువు గ్రంథాలయ శాఖ కార్యాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ బుధవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలోని సౌకర్యాలపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల గ్రంథాలయ అధికారి ప్రసాద్ నాయక్, పాఠకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

కదిరి టౌన్: పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఆర్‌జేడీ శామ్యూల్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ చెన్నకృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలుపు మందులతో వేర్లు దెబ్బతింటున్నాయి

తాడిమర్రి: చీనీ తోటల్లో కలుపు నివారణ కోసం మందులు పిచికారీ చేస్తుండటంతో చెట్ల వేర్లు దెబ్బతింటున్నాయని ఉద్యానవన జిల్లా అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. కునుకుంట్లలో చీనీ తోటల సాగుపై బుధవారం జరిగిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చీనీతోటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రామసుబ్బయ్యతో కలసి ఆయన చీనీ తోటల్లో పర్యటించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి అమరేశ్వరి, ఏఓ రమాదేవి పాల్గొన్నారు.

మహిళల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

పుట్టపర్తి టౌన్: మహిళల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ విజయకుమార్ సూచించారు. బుధవారం ఆయన పుట్టపర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్ డెస్క్‌తో పాటు రికార్డులు, హాజరుపట్టిక పరిశీలించి పాత, కొత్త కేసులు వివరాలను అడిగి తెలుసుకుని, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలన్నారు.

నేడు అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

బత్తలపల్లి/ ముదిగుబ్బ: ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. బుధవారం బత్తలపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ సరస్వతి మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి, ముదిగుబ్బ మండలం సీసీ రేవు, కోటిరెడ్డిపల్లి, వడ్డుకిందపల్లి తండా, నల్లచెర్లోపల్లి అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేడు ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కదిరి టౌన్: సున్నపుగుట్ట తండా శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని రూరల్ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.4,020 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

తోలు బొమ్మలాట కళాకారునికి సత్కారం

ధర్మవరం రూరల్: నిమ్మలకుంట తోలుబొమ్మల కళాకారుడు షిండే చిదంబరరావు సత్కారం పొందారు. ఇటీవల ముంబైలోని కేటీ ఏరియాలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తోలుబొమ్మలాట ప్రదర్శన నిర్వహించారు. 8 మంది తోలు బొమ్మలాట కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న షిండే చిదంబరరావు ప్రదర్శనను మెచ్చి నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు.

బాధిత రైతును ఆదుకోవాలి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని హరియాన్ చెరువు గ్రామంలో రైతు కంచికుంట ఆదినారాయణకు చెందిన గడ్డివాములకు ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయాయి. రైతుకు పాడిపశువుల పోషణ భారంగా మారింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు బుధవారం రైతు ఆదినారాయణను పరామర్శించారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను కలసి సమస్యను విన్నవించారు. రైతుకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పవన్‌కుమార్‌రెడ్డి, బొగ్గ కిష్ట, రాము, రామకృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డీపీటీఓతోపాటు 75 మంది ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. అనంతరం రక్త దానం చేసిన ఉద్యోగులకు రెడ్ క్రాస్ సంస్థ వారు అందించిన ప్రశంసా పత్రాలు అందజేశారు. డీపీటీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రతి డ్రైవరూ అప్రమత్తంగా ఉండి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం సురక్షితమని ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ విశ్వనాథ్, డిపో మేనేజర్ ఇనయతుల్లా, డాక్టర్ గోపాల్ రెడ్డితో పాటు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎన్పీకుంట: మండలంలోని ఎదురుదొన, మేకలచెరువు పంచాయతీల్లో బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్.ప్రతాప్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి మామిడి రైతులకు అవగాహన కల్పించారు. మామిడి పంట పూత దశలో ఉన్నందున ఎరువులు వేసి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఇప్పటి వరకు పోషకాలు పిచికారీ చేయకుండా ఉంటే ఒక లీటరు నీటికి 5గ్రాముల 13–0–45, 5గ్రాముల ఫార్ములా4, రెండు గ్రాముల బోరాన్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మండలంలో భూమి ఉన్న ప్రతి రైతుకూ కేంద్ర ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనుందని, దీని కోసం ప్రతి రైతూ తమ ఆధార్, పాసు పుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరు తీసుకుని రైతు సేవ కేంద్రంలో ఈ నెల 25లోగా ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది సున్నుబాషా, హరినాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

17న ద్విచక్ర వాహనాల వేలం

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఫరూక్‌అజాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగే వేలంపాటలో పాల్గొనే వారు నిర్ణీత రుసుము చెల్లించి పాల్గొనాలని సూచించారు. వేలంలో వాహనాన్ని దక్కించుకున్న వారు ఆ సొమ్మును వెంటనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా గరుడ సేవ



గరుడ వాహనంపై లక్ష్మీ చెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా గరుడసేవ నిర్వహించారు. స్వామిని గరుడ వాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బత్తలపల్లి: భూమి కలిగిన ప్రతి రైతూ రైతు సేవ కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఓబిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ (ఫార్మర్ రిజిస్ట్రీ) చేయించుకోవడం వల్ల వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ(డిజిటలైజేషన్) చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) ఆధార్ తరహాలో అందించనుందన్నారు.

కంది పంట దగ్ధం



కాలిపోయిన కంది పంట

నల్లమాడ: బొగ్గలపల్లి సమీపాన పది ఎకరాల్లో సాగు చేసిన కంది పంట బుధవారం మధ్యాహ్నం దగ్ధమైంది. కోత కొచ్చిన పంట దగ్ధం కావడంతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు నాగరాజు, సూరిబాబు, వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సమీప గుట్టలోని ఎండు గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో అదికాస్తా కంది పంటకు వ్యాపించిందన్నారు. సమాచారం అందుకున్న కదిరి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



తులసి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన తులసి అనే మహిళ కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది బుధవారం సాయంత్రం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మంత్రి రాక

బత్తలపల్లి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం పత్యాపురం గ్రామానికి రానున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని డి.చెర్లోపల్లి పంచాయతీ పత్యాపురంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, భూమి పూజ కార్యక్రమానికి ఆయన హాజరవుతారన్నారు.

సూచనలు పాటించండి

బత్తలపల్లి: వేరుశనగలో చీడపీడల నివారణకు వ్యవసాయ శాఖ సూచించే నివారణ చర్యలు పాటించాలని కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం తెగుళ్ల శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.వి.భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆర్.నరసింహులు, డాక్టర్ ఎం.రమేష్‌నాయక్ కోరారు. బుధవారం పోట్లమర్రి గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాట్లాడారు. వేరుశనగలోని సమగ్ర యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్ర సందర్శన చేసి వివిధ పంటలలో వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఉపేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేషయ్యగారిపల్లి కొండల్లో చిరుత!

ఓడీచెరువు : శేషయ్యగారిపల్లి తండా పరిసర ప్రాంత కొండల్లో చిరుత సంచరిస్తున్న ఆనవాళ్లు బయటపడ్డాయి. బుధవారం శేషయ్యగారిపల్లికి చెందిన ఆనంద్ నాయక్ మేకపోతు కళేబరం కొండల్లో గుర్తించిన స్థానికులు చిరుత అడుగులు పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు అనుమానించారు. చిరుతే మేకపోతును చంపి ఉండొచ్చని వాపోయారు. చిరుత సంచార విషయం చుట్టుపక్కల గ్రామస్తులకు తెలియడంతో భయందోళనకు గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు





చికిత్స పొందుతున్న రామసుబ్బయ్య, వెంకటేష్

ధర్మవరం అర్బన్: పట్టణంలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన రామసుబ్బయ్య కోడిగుడ్ల వ్యాపారి. తోపుడు బండిపై కోడిగుడ్లు పెట్టుకుని తోసుకుంటూ కదిరిగేటు దాటగానే వెనుక వచ్చిన జేసీబీ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రామసుబ్బయ్య కుడికాలికి తీవ్రగాయాలయ్యాయి. ఇదిలా ఉండగా ధర్మవరం మండలం తుంపర్తి కాలనీకి చెందిన వెంకటేష్ బుధవారం పట్టణంలోని రేగాటిపల్లి రైల్వేగేటు నుంచి సాయిబాబా ఆలయం వైపునకు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి ఎర్రగుంటకు వెళ్లే బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్ కుడి కాలుకి తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల గ్రామంలో బుధవారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రైతు తలారి శ్రీకాంత్ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం ఉదయం గ్రామానికి చెందిన మరో రైతు పొలంలోకి వేరుశనగ విత్తనాలు విత్తడానికి బాడుగకు వెళ్లాడు. ఎద్దులతో విత్తనాలు విత్తుతుండగా కరెంటు స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైర్‌ను ఒక ఎద్దు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని రైతులు తెలిపారు.

సాఫీగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

కదిరి టౌన్: కదిరి, నల్లచెరువు ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి కదిరి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2 అంగన్‌వాడీ కార్యకర్తలు, రెండు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 4 సహాయకురాళ్లు మొత్తం 8 పోస్టులకు గాను 31 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్ర నాయక్, సీడీపీఓలు రాధిక, జయంతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

కదిరి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ వి.నారాయణరెడ్డి సూచించారు. మదనపల్లెకు చెందిన మిట్స్ కాలేజీ విద్యార్థులతో కదిరిలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఇందిరాగాంధీ సర్కిల్, మున్సిపల్ కార్యాలయం, టవర్‌క్లాక్, వేమారెడ్డి సర్కిల్ మీదుగా తిరిగి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సీఐ అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎస్‌ఐ బాబ్జాన్, సిబ్బంది పాల్గొన్నారు.